క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి

కరీంనగర్‌కార్పొరేషన్‌: నగరంలోని 16వ డివిజన్‌లో రూ.1.66 కోట్ల సాధారణ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, ఎస్‌డబ్ల్యూజీ డ్రెయినేజీ, పైపులైన్‌ పనులకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ ఆదివారం భూమిపూజ చేశారు. ప్రగతినగర్‌లో రూ.12.20 లక్షలు, మధురానగర్‌లో రూ.48 లక్షలు, పద్మనగర్‌లో రూ.48 లక్షలు, వినాయకనగర్‌లో రూ.58 లక్షలతో చేపట్టనున్న పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్‌ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్‌ బోనాల శ్రీకాంత్‌, కమిషనర్‌ సేవా ఇస్లావత్‌, ఎస్‌ఈ నాగమల్లేశ్వర్‌రావు, ఈఈలు మహేందర్‌, కిష్టప్ప, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ చైతన్య, డివిజన్‌ వాసులు పాల్గొన్నారు.

‘స్వప్న మంజరి’ గజల్‌ సంపుటి ఆవిష్కరణ



గజల్‌ సంపుటిని ఆవిష్కరిస్తున్న కవులు

కరీంనగర్‌ కల్చరల్‌: భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నగరంలోని గణాంకభవన్‌లో ఆదివారం రచయిత్రి కాసనగొట్టు స్వప్న రచించిన స్వప్న మంజరి గజల్‌ సంపుటిని ముమ్మారు గిన్నీస్‌ రికార్డు సృష్టికర్త, తెలుగు, ఉర్దూ గజల్‌ గాయకుడు మ్యాస్ట్రో డాక్టర్‌ గజల్‌ శ్రీనివాస్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజల్‌ తన ప్రాణమని అన్నారు. గజల్‌ ప్రక్రియలో తన గురువు సినారె అని, ఈ ప్రాంత సాహితీ పరిమళం చాలా గొప్పదని తెలిపారు. స్వప్న రచించిన గజల్స్‌ అద్భుతంగా ఉన్నాయని అభినందించారు. ఆమెను సాహిత్యంలో ప్రోత్సహిస్తున్న భర్త అభినందనీయుడని అన్నారు. అతిథులుగా హాజరైన రచయిత, విమర్శకుడు దాస్యం సేనాధిపతి, ఆకాశవాణి (పర్భని) మహారాష్ట్ర కేంద్రం, గజల్‌ కవి ఆర్‌ఎస్‌ఎస్‌ శ్రీనివాస్‌, సంస్థ గౌరవాధ్యక్షుడు శ్రీదాస్యం లక్ష్మయ్య మాట్లాడారు. ఇంజపురి వసంత పుస్తక పరిచయం చేశారు. వైరాగ్యం ప్రభాకర్‌ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాకురాలు సీహెచ్‌ రజిత, సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.


పేద విద్యార్థికి రూ.15వేల ఆర్థికసాయం



సాయం అందజేస్తున్న నగునూరి రాజేందర్‌

కరీంనగర్‌: ఆర్థిక ఇబ్బందులతో ఫీజు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థికి సంఘ సేవకుడు, ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు నగునూరి రాజేందర్‌ మిత్రులతో కలిసి రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్‌ మూడో సంవత్సరం చదువుతున్న సారిక కుటుంబంలో ఆర్థిక ఇబ్బంది వల్ల ఫీజు చెల్లించకపోయింది. దీంతో ఈ మధ్య జరిగిన పరీక్షలకు కాలేజీ యాజమాన్యం అనుమతించలేదు. ఈ పరిస్థితుల్లో అమ్మాయి తండ్రి వెంకటేశం నగునూరి రాజేందర్‌ను సంప్రదించి అమ్మాయి పై చదువుల కోసం రూ.15వేలు సాయం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన రాజేందర్‌ వ్యక్తిగతంగా రూ.11వేలు, మిత్రులు శివనాథుని శ్రీనివాస్‌, ఏవీ మల్లికార్జున్‌, సంతోశ్‌కుమార్‌, హరిప్రసాద్‌, పల్లెర్ల వేణులు కలిసి రూ.4వేలు కలిసి మొత్తం రూ.15వేలను అమ్మాయి సారికకు ఆదివారం అందజేశారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి శివనాథుని శ్రీనివాస్‌, మాజీ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌, సంతోశ్‌కుమార్‌, రామ్మోహన్‌, హరిప్రసాద్‌, వేణు, అమ్మాయి తండ్రి వెంకటేశం పాల్గొన్నారు.

పరామర్శ



కరీంనగర్‌: నగరంలోని 29వ డివిజన్‌కు చెందిన సంగ లక్ష్మీనారాయణ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ నాయకుడు మేనేని రోహిత్‌రావు ఆదివారం లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులను పరామర్శించారు. రూ.10వేల ఆర్థికసాయం అందజేసి బియ్యం బస్తా అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మడుపు మోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

చూడముచ్చటగా..







నగరంలో సివిల్‌ హాస్పిటల్‌ వెనుకాల చిరువ్యాపారుల కోసం నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన దుకాణ సముదాయం ఆకర్షణీయంగా ఉంది. నగరంలో చెప్పుకోదగ్గ కట్టడాలైన టవర్‌సర్కిల్‌, కమాన్‌, డ్యాం తదితర బొమ్మలను దుకాణ గదుల్లో రంగురంగులతో చిత్రీకరించారు. దీంతో కొనుగోలు దారులకు దుకాణాలు శుభ్రంగా, ఆకర్షణీయంగా కనిపించనున్నాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్‌, కరీంనగర్‌

తెలంగాణతోనే తాగునీటి ప్రగతి



మాట్లాడుతున్న మేయర్‌ సునీల్‌రావు

- త్వరలో 24 గంటలు నీటి సరఫరా
- మేయర్‌ సునీల్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్‌: ప్రత్యేక తెలంగాణ వచ్చాక తాగునీటి సరఫరాలో గొప్ప ప్రగతిని సాధించామని మేయర్‌ యాదగిరి సునీల్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నగర శివారులోని ఫిల్టర్‌బెడ్‌ వద్ద నగరపాలక సంస్థ మంచినీళ్ల పండుగ నిర్వహించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్‌ మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో ప్రజలు తాగునీటికి కష్టపడ్డారని, గుక్కెడు నీటి కోసం బిందెలతో కొట్టుకొన్న పరిస్థితులు చూశామన్నారు. స్వరాష్ట్రంలో మిషన్‌ భగీరథ పథకంతో ప్రజల తాగునీటి కష్టాలు గట్టెక్కాయన్నారు. నగరంలో గతంలో రోజువిడిచి రోజు నీటి సరఫరా ఉండేదని, ఇప్పుడు 4 లక్షల 12 వేల మంది జనాభాకు 80 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఫిల్టర్‌ బెడ్‌ నుంచి ప్రతి రోజూ నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. 2014లో 48 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఫిల్టర్‌ బెడ్‌ నుంచి నీటి సరఫరా చేయగా రూ.135 కోట్లతో అర్బన్‌ మిషన్‌ భగీరథ ద్వారా మరో 36 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఫిల్టర్‌బెడ్‌, మెయిన్‌ బ్యాలెన్సింగ్‌ రిజర్వాయర్‌ నిర్మించుకున్నామన్నారు. అలాగే 133 కి.మీ మేర కొత్త పైప్‌లైన్‌ నిర్మించి 65 లక్షల లీటర్ల సామర్థ్యంతో ప్రజలకు నీరు అందిస్తున్నట్లు తెలిపారు. నీటి శుద్ధీకరణ రక్షణ కోసం రూ.2 కోట్లతో ప్రహరీ, అంతర్గత సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. రూ.కోటితో 14 ఎంఎల్‌డీ ఫిల్టర్‌ బెడ్‌ మరమ్మతు పనులు, వేస్ట్‌ వాటర్‌ సంప్‌, బూస్టర్ల వద్ద జనరేటర్ల కోసం టెండర్‌ పూర్తి చేశామన్నారు. రూ.2 కోట్లతో కోర్టు రిజర్వాయర్‌లో 9 లక్షల సామర్థ్యంతో మరో రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నామన్నారు. త్వరలో 24 గంటల తాగునీటి సరఫరా చేస్తామన్నారు. అంతకుముందు కార్పొరేటర్లకు ఫిల్టర్‌బెడ్‌ పనితీరు, నీటి శుద్ధీకరణ విధానం, ఫిల్టర్‌ సామర్థ్యం, ల్యాబ్‌ పరీక్షలు, మోటార్ల పనితీరును మేయర్‌, కమిషనర్‌ వివరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌ సేవా ఇస్లావత్‌, కార్పొరేటర్లు గందె మాధవి, గంట కల్యాణి, గుగ్గిళ్ల జయశ్రీ, మర్రి భావన, వాల రమణారావు, నేతికుంట యాదయ్య, ఐలేందర్‌ యాదవ్‌, దిండిగాల మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.



ఫిల్టర్‌ బెడ్‌ పనితీరు వివరిస్తున్న మేయర్‌

కమిషనర్‌పై కార్పొరేటర్‌ ఆగ్రహం

సమావేశంలో కమిషనర్‌ సేవా ఇస్లావత్‌పై 14వ డివిజన్‌ కార్పొరేటర్‌ దిండిగాల మహేష్‌ ఆగ్రహం వ్యక్తం చేయడం కలకలం సృష్టించింది. కమిషనర్‌ ప్రసంగించేందుకు సిద్ధమవుతున్న సమయంలో మహేష్‌ వేదిక వద్ద ఉన్నారు. దీంతో కూర్చోపొండి అంటూ మహేష్‌ను ఉద్దేశించి కమిషనర్‌ అనడంతో ఆగ్రహించిన మహేష్‌ తనను ఎలా కూర్చొమ్మంటారంటూ వాదనకు దిగారు. తాను కార్పొరేటర్‌నని సమస్య చెప్పుకుందామని వస్తే కూర్చొమనడమేమిటని ప్రశ్నించారు. వెంటనే మేయర్‌ సునీల్‌రావు జోక్యం చేసుకొని సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

హరితోత్సవానికి వేళాయే

- ఊరికి 2వేల మొక్కలు నాటాలని లక్ష్యం
- నేడు నగునూరులో ప్రారంభం



నగునూరులో గుంతలు తవ్వుతున్న కూలీలు

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ మండలంలో తొమ్మిదో విడత హరితహారం చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఏటా వర్షాలు కురిసిన అనంతరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించే వారు కాగా ప్రస్తుతం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవం పేరిట మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలస్థాయిలో నగునూరులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులు లాంఛనంగా ప్రారంభిస్తారు. ఆదివారం ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, ఈజీఎస్‌ ఏపీవో శోభరాణి గ్రామంలో పర్యటించారు. ఉపాధికూలీలు తవ్వుతున్న గుంతలను తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు.

నేడు ఊరికి 2వేల మొక్కలు

కరీంనగర్‌ మండలంలో హరితహారంలో భాగంగా మొత్తం 1.57లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈమేరకు 17 గ్రామాల్లోని నర్సరీల్లో మొత్తం 1.70లక్షల మొక్కలు పెంచుతున్నారు. సోమవారం హరితోత్సవంలో భాగంగా ఊరికి 2వేల చొప్పున 17 గ్రామపంచాయతీల్లో మొత్తం 34వేల మొక్కలు నాటేందుకు వీలుగా ఆయా గ్రామాల్లో స్థలాలను గుర్తించారు. ఇప్పటివరకు 10వేల గుంతలను ఉపాధిహామీ కూలీలతో తవ్వించారు. అయితే వర్షాలు కురువకపోవడం, ఎండలు తీవ్రంగా ఉండటంతో మొక్కలు నాటడంపై సందిగ్ధత నెలకొంది. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత తలకు మించిన భారం కావడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధులతో కొన్ని మొక్కలను నాటించి హరితోత్సవాన్ని ప్రారంభించిన అనంతరం వర్షాలు కురిసిన తర్వాత మిగితా మొక్కలు నాటాలని నిర్ణయించారు.

అందుబాటులో మొక్కలు

తొమ్మిదో విడత హరితహారంలో నిర్ణీత లక్ష్యం మేరకు నాటేందుకు అవసరమైన మొక్కలు నర్సరీల్లో అందుబాటులో ఉన్నాయి. వేసవిలో మొక్కల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. పెద్దసైజు మొక్కలున్నాయి. హరితోత్సవంలో కొన్ని మొక్కలను నాటి వర్షాలు పడిన అనంతరం లక్ష్యం ప్రకారం మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాం.

– సీహెచ్‌.జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో, కరీంనగర్‌రూరల్‌

ఉచిత మెగా వైద్యశిబిరం



వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్‌: రెనే ఆస్పత్రి, మేవెన్‌ మెడికల్‌ సెంటర్‌ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని రెనే ఆస్పత్రిలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వెరికోస్‌ వెన్స్‌, పైల్స్‌, ఫిస్టులా, ఫిషర్స్‌ పరీక్షలు చేశారు. ప్రముఖ ఇంటర్నేషనల్‌ రేడియాలజిస్ట్‌ డాక్టర్‌ బాలాజీ పటేల్‌ కోలా, ప్రముఖ సర్జన్‌ డాక్టర్‌ సంజయ్‌సింగ్‌యాదవ్‌లు పాల్గొని 185 మంది రోగులకు రూ.2వేల విలువ గల అనోస్కోపీ, రూ.3,500 విలువ గల కలర్‌ డాప్లర్‌ స్క్రీనింగ్‌ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెనే హాస్పటల్‌ చైర్మన్‌ డాక్టర్‌ బంగారి స్వామి మాట్లాడుతూ ఇలాంటి సూపర్‌ స్పెషాలిటీ వైద్య శిబిరాలను భవిష్యత్‌లో సామాన్యులకు, మారుమూల ప్రాంతాల వారికి కూడా అందించాలన్న మా లక్ష్యం దిశగా కలిసి పనిచేస్తామని తెలిపారు.

గ్రామాల్లో మంచినీళ్ల పండుగ



దుర్శేడ్‌లో నీళ్ల పండుగ ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి తదితరులు

- భగీరథ నీటిపై అవగాహన ర్యాలీలు

కరీంనగర్‌రూరల్‌: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కరీంనగర్‌ మండలంలోని పలు గ్రామాల్లో నీళ్ల పండుగ నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మిషన్‌ భగీరథ వాటర్‌ట్యాంకుల వద్ద నుంచి గ్రామస్తులతో కలిసి ప్రజాప్రతినిధులు ర్యాలీలు నిర్వహించి భగీరథ నీటిపై అవగాహన కల్పించారు. దుర్శేడ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్‌.జగన్మోహన్‌రెడ్డి, సర్పంచ్‌ గాజుల వెంకటమ్మ, ఉప సర్పంచ్‌ సుంకిశాల సంపత్‌రావు, ఎంపీటీసీ గొల్లె రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి, ఏఈవో పైడితల్లి, సింగిల్‌విండో డైరెక్టర్‌ గాజుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు. ఫకీర్‌పేటలో ఉత్తమ ఉద్యోగులుగా పంపు ఆపరేటర్‌ వేల్పుల అంజయ్య, ఆశా వర్కర్‌ మోర రాజమణిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ కటకం నందయ్య, పంచాయతీ కార్యదర్శి స్వప్న, గ్రామప్రత్యేక అధికారి కనుకయ్య తదితరులు పాల్గొన్నారు. మొగ్దుంపూర్‌, చామనపల్లి, నగునూరు గ్రామాల్లో జరిగిన నీళ్ల పండుగలో ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన అవగాహన ర్యాలీల్లో శుద్ధి చేసిన భగీరథ నీటిని మాత్రమే తాగాలని ఎంపీడీవో కోరారు.



పంపు ఆపరేటర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్‌

పొమ్మనలేక పొగపెడుతున్న సిబ్బంది..?

- కరీంనగర్‌ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పేషెంట్లకు ప్రతికూల పరిస్థితులు



కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధానాసుపత్రి

కరీంనగర్‌టౌన్‌: కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో సిబ్బంది కమీషన్ల దందాను వీడడం లేదా..? క్రిటికల్‌ పేషెంట్లను ఎలాగైనా ప్రైవేటుకు తరలించాలనే ఉద్దేశ్యంతో పొమ్మనలేక పొగబెడుతున్నారా..? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఇన్నాళ్లు క్రిటికల్‌ పేషెంట్లకు మాయమాటలు చెప్పి నేరుగా ప్రైవేటుకు పంపిన ఘటనలు ఉన్నాయి. ఇటీవల పేషెంట్లను ప్రైవేటుకు పంపిస్తున్న విషయంలో అధికారులు కొరడా ఝుళిపిస్తుండడంతో సిబ్బంది కొత్త పంథాను ఎంచుకున్నారు. ఓ పేషెంట్‌ శుక్రవారం ఐసీయూలో చికిత్స పొందుతుండగా సదరు పేషెంట్‌ను చూసేందుకు వారి బంధువులు వచ్చినట్లు తెలిసింది. అయితే వారేదో ఇబ్బంది పెట్టినట్లు ఐసీయూ సిబ్బంది వారిపై దురుసుగా ప్రవర్తించిన తీరు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంతేకాకుండా ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఆరా తీయగా అలాంటిదేమీ జరగలేదని తేలినట్లు సమాచారం. అయితే పేషెంట్లను ఏదోరకంగా ఇబ్బంది పెట్టి ఆసుపత్రిలో వైద్యంపై అసహనం పుట్టిస్తే వారే బయటకు వెళ్తారని, వారిని ఏదో ఒక ప్రైవేటు ఆసుపత్రికి రెఫర్‌ చేయవచ్చనే ప్రయత్నంలో భాగంగానే సిబ్బంది తీరు కనబడుతోందని ఆందోళన వ్యక్తం అవుతోంది. గరీబులను రాబందువుల్లా పీక్కుతినే ఇలాంటి వారిపై కఠిన చర్యలు చేపట్టాలని పేషెంట్ల బంధువులు కోరుతున్నారు. కాగా ఇప్పటికే 3 నెలల పాటు విధులకు హాజరు కాని ఓ ఉద్యోగిని వైద్య విధానపరిషత్‌కు సరెండర్‌ చేయాల్సిన అధికారులు ఎలాంటి చర్యలు లేకుండానే విధుల్లో చేర్చుకున్నట్లు తెలిసింది. ఇలా ఉదాసీనంగా వ్యవహరించడం వల్లనే అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ విషయమై ఆసుపత్రి మెడికల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా ఐసీయూ విషయమేది తన దృష్టికి రాలేదని, పేషెంట్లకు ఇబ్బందులుంటే తన దృష్టికి తేవాలని తెలిపారు.

‘అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే రాద్ధాంతం’



రైల్వే ట్రాక్‌ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్‌ నాయకులు

కరీంనగర్‌టౌన్‌: ఆర్వోబీ నిర్మాణ విషయంలో బీజేపీ, బీఆర్‌ఎస్‌ నాయకుల అసమర్థతను కప్పి పుచ్చుకునేందుకే ఇరు పార్టీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని కాంగ్రెస్‌ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ నాయకుల వైఖరిని ఖండిస్తూ ఆదివారం నగరంలోని రైల్వే ట్రాక్‌ వద్ద కాంగ్రెస్‌ పార్టీ నగరశాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రజలు ఓవైపు ఇబ్బంది పడుతుంటే.. జాప్యానికి కారణం మీరంటే మీరని ఒకరిపై మరొకరు నెట్టేసి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్‌, మాజీ ఎంపీ వినోద్‌ కుమార్‌ అసమర్థత వల్లే ఆర్వోబీకి నిధులు మంజూరు కాలేదని తెలిపారు. ప్రతిరోజూ కొన్ని వేల మంది ప్రయాణికులు ఇబ్బందిపడుతుండగా, స్కూల్‌ బస్సులు, అంబులెన్సులు నిలిచిపోతుంటే చిత్తశుద్ధి లేని నాయకులు సంవత్సరాల కొద్ది జాప్యం చేసి మా ఘనత అంటే మా ఘనత అని ప్రకటనలిచ్చుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెతుకు కాంతయ్య, ఎండీ.తాజ్‌, శ్రవణ్‌నాయక్‌, సమద్‌ నవాబ్‌, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం విలాస్‌రెడ్డి, కుర్ర పోచయ్య, ఖమ్రొద్దీన్‌, దండి రవీందర్‌, దన్నుసింగ్‌, బత్తిని చంద్రయ్య, అబ్దుల్‌ బారీ, షబానా మహమ్మద్‌, ఊరడి లత, మామిడి సత్యనారాయణరెడ్డి, ముక్క భాస్కర్‌, సలీమొద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా రతన్‌సింగ్‌



నియామకపు పత్రం అందుకుంటున్న రతన్‌సింగ్‌

కరీంనగర్‌టౌన్‌: బీజేపీ పశ్చిమ జోన్‌ మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా రతన్‌సింగ్‌ను నియమిస్తూ ఆదివారం మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహ్మద్‌ సమీపర్వేజ్‌ ఉత్తర్వులు జారీ చేశారు. రతన్‌సింగ్‌ నియామకం పట్ల మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బల్బీర్‌సింగ్‌, జోన్‌ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిడి రమేశ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ‘పారమిత’ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రసాదరావు

కొత్తపల్లి(కరీంనగర్‌): జేఈఈ అడ్వాన్స్‌డ్‌–2023 ఫలితాల్లో పద్మనగర్‌లోని పారమిత విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబర్చారు. మొదటి బ్యాచ్‌లోని పారమిత హెరిటేజ్‌ పాఠశాల నుంచి 14 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షకు హాజరవ్వగా ముగ్గురు విద్యార్థులు ఐఐటీలో సీటు పొందే అర్హత సాధించినట్లు పారమిత విద్యా సంస్థల చైర్మన్‌ ఇ.ప్రసాదరావు తెలిపారు. కేతిరెడ్డి హర్షవర్ధన్‌ 4415 ర్యాంకు, కందుకూరి అభిజ్ఞ 5,229 ర్యాంకు, ఎం.తేజేశ్వర్‌లు జాతీయస్థాయి ర్యాంకులు సాధించగా, సుమారు పది మంది విద్యార్థులు ఎన్‌ఐటీలో సీటు సాధించడం గర్వంగా ఉందన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో ప్రసాదరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల డైరెక్టర్లు రశ్మిత, అనుకర్‌ రావు, ప్రసూన, వినోద్‌రావు, వీయూఎం ప్రసాద్‌, పాఠశాల ప్రిన్సిపాల్‌ ఎం.శ్రీకర్‌, సమన్వయకర్త నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫల పంచామృతాభిషేకం



విద్యానగర్‌(కరీంనగర్‌): కరీంనగర్‌ మండలం నగునూరులోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో నిర్వహిస్తున్న ఆషాఢమాసం శాకాంబరీ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని అమ్మవారికి ఆలయ ధర్మాధికారి వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ ఫలపంచామృతాభిషేకం, విశేష హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాకాంబరీ ఉత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ పూజా కార్యక్రమం జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఒడిబియ్యం, చీరెసారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో ఆలయ ఫౌండర్‌ చైర్మన్‌ వంగల లక్ష్మణ్‌, ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.